www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025

5

చిత్తూరు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు కలెక్టరేట్‌లో 10వ తేదీ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో నిర్వహించన్నుట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

దుమ్మంది నాదం...
సై అంది ప్రమాదం..!

- భద్రతా ప్రమాణాలు పాటించిన ఆర్ అండ్ బి అధికారులు
- నిత్యం ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- అసంపూర్తిగా రోడ్డు పనులు
- అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు -గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో జోడి చింతల పోలీస్‌స్టేషన్ నుండి కనికాపురం చెక్‌పోస్టు వరకు అడుగుకో గుంత కనిపిస్తున్నాయి. దీంతో రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో రోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు పనులను చేపడుతున్నారు. రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుపై కంకర పోసి అలాగే వదిలేశారు.

ఇది అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ఈ రహదారిగుండా ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. రోడ్డు పనులు చేసే గుత్తేదారులు రోడ్డుపై కంకర పోసిన తర్వాత దుమ్ము లేకుండా ప్రతిరోజు నీళ్ల ట్యాంకులతో నీళ్లు పట్టి దుమ్ము లేకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. అయితే గుతేదారులు రోడ్డుపై నీళ్లు పట్టకపోవడంతో రోడ్డుపై వాహనాలు వెళుతుండగా విపరీతంగా దుమ్ము లేస్తుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు సైతం కనిపించినంతగా దుమ్మునుండుకుంటుంది. రోడ్డు విరుపక్కల ఉన్న నివాస గృహాల వారు రోడ్డుపై వస్తున్న దుమ్ముతో, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కంకరాళ్లలకు తోడుగా విపరీతమైన దుమ్ముపైకి లేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ద్విచక్ర వాహనదారులు గులకరాళ్ళపై పట్టు తప్పి కింద పడి గాయాల పాలవుతున్నారు. గుత్తేదారులు జల్లి కంకర పోసి తారు బ్యాచ్ వేయకపోవడంతో దుమ్మంతా వాహనదారులపై నిండుతుంది. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వెళ్ళాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులు పనులు చేసే చోట, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నా సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ అధికారులు భద్రత ప్రమాణాలు పాటించే దిశగా గుత్తేదారుకి ఆదేశాలు ఇచ్చి పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై జల్లి పోసి వదిలేయడంతో విపరీతంగా దుమ్ము లేస్తున్న దృశ్యం

పుస్తక ప్రదర్శన పై
మనువాదుల దాడి దారుణం

- ఖురాన్ విశ్లేషణపై మతోన్మాదుల చర్య దుర్మార్గం
- రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావుల ఖండన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

ఖురాన్‌ను విశ్లేషిస్తూ శర్మ అనే వ్యక్తి తెలుగులో రాసిన గ్రంథాన్ని కొందరు హిందూ మతోన్మాదులు చించి పోగులు పెట్టి, వీరంగం సృష్టించారు. తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో శుక్రవారం సాయంత్రం 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేస్తూ, ఆ పుస్తకాన్ని తగలపెట్టడానికి విఫలయత్నం చేశారు. అబద్దాలతో, బూతులతో విరుచుకుపడ్డారు. విశాలాంధ్ర బుక్ స్టాల్ వద్దకు కూడా వెళ్ళి హడావిడి చేశారు. ఈ సంఘటకు నిరసనగా 'సాహిత్యం, భావప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాద శక్తులు దాడులను అరికట్టాలి' అని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకట శివయ్య భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మేధావులు, రచయితలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించారు. అవి వారి మాటల్లోనే...

ఈ సంఘటన జరిగినప్పుడు పుస్తక ప్రదర్శనశాలలో అక్కడే ఉన్న వాకా ప్రసాద్, సాహితీవేత్త సాకం నాగరాజు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సంఘటన పూర్వాపరాలను **పౌరచైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్** వివరిస్తూ, 'ఒక స్టాల్ దగ్గర కేకలు వినిపిస్తే నేను, సాకం నాగరాజు పరిగెత్తుకుంటూ వెళ్ళాం. ఒక పుస్తకాల షాపు నుంచి ఖురాన్‌లో ఇస్లాంకు, హిందూ మతానికి మధ్య ఉన్న సారూప్యతను విశ్లేషిస్తూ శర్మ అనే వ్యక్తి రాసిన పుస్తకాన్ని కొద్ది మంది హిందుత్వ వాదులు చించిపోగులు పెడుతున్నారు.. దాన్ని తగల పెట్టడానికి కూడా ప్రయత్నిస్తూ, పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. విశాలాంధ్ర బుక్ స్టాల్ వద్దకు వచ్చి, జై శ్రీరాం అన్న నినాదాలతో, అసభ్యకర పదజాలంతో 'రామాయణ విష వృక్షం' రాసి అమ్ముతున్నారు. (రామాయణ విష వృక్షం రాసింది రంగనాయకమ్మ) తల్లిని, చెల్లెని పెళ్లి చేసుకోమని చెప్పే పెరియార్ పుస్తకాలు కూడా వీళ్లు అమ్ముతున్నారు' అంటూ తమ అజ్ఞానాన్ని ప్రదర్శించారు. మీకు ఏదైనా అభ్యంతరం ఉంటే పుస్తక ప్రదర్శన నిర్వాహకులకు చెప్పండి కానీ, ఇలా అరవడం, బూతులు తిట్టడం, దాడి చేయడం హిందుత్వానికే కళంకం తెస్తుందని నచ్చచెప్పాను.. పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేసిన భారతీయ విద్యాభవన్ అధ్యక్షులు సత్యనారాయణ రాజు అక్కడికి వచ్చి వారికి సర్ది చెప్పి, ఆ పుస్తకం అమ్మిన స్టాల్‌ను వెంటనే మూయించారు. వాళ్ళు చాలా అమానుషంగా ప్రవర్తించారు. ఇలాంటి సంఘటనలను ఖండించాలని కోరుతున్నాను.

అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మినారాయణ మాట్లాడుతూ "ఇది ఉన్మాద ప్రారంభ దశ. దేశంలో ఉన్మాదం పెరుగుతోందని అర్థం చేసుకోవాలి. మనం ఏం తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో, ఏ సాహిత్యం చదవాలో వీరే చెపుతారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం. తమ భావాలకు వ్యతిరేకమైన వాటిపైన పాలక పక్షాలు దాడులుచేస్తాయి. సఫ్దర్ హష్మిని చంపేశారు. పెరుమాళ్ మురుగన్‌పై దాడులు చేసి, ఆయన పుస్తకాలను చించేశారు. 'రచయితగా చచ్చిపోయాను' అని ఆయన ప్రకటించాల్సిన పరిస్థితి తెచ్చిపెట్టారు. ఈ ఉన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య వేదికను ఏర్పాటుచేసి పోరాడాలి."

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ "మతోన్మాదాన్ని, మత దురహంకారాన్ని సహించడం వల్ల ఆ మతానికి కీడు జరుగుతుందే కానీ, మేలు జరగదు. రాజ్యాంగం ప్రకారం నిషేధించని పుస్తకాన్ని ఎక్కడైనా ఎప్పుడైనా అమ్ముకోవచ్చు. నిషేధించని పుస్తకాన్ని అమ్మకూడదనడం, అల్లరి చేయడం రాజ్యాంగం ప్రాకారం నేరం. ఈ గడ్డపైన అన్ని మతాల వారు జీవించడానికి, వారి భావజాలాన్ని ప్రచారం చేసుకునే హక్కు వారికుంది. విశాలాంధ్ర హేతువాద, మార్క్సిస్టు భావజాలానికి అనుకూలమైనవి కనుకనే రామాయణ మహాభారతాలు కూడా అమ్ముతున్నారు" అని గుర్తు చేశారు.

సీనియర్ జర్నలిస్ట్ రాఘవ మాట్లాడుతూ "ఝుంఝు, లే కవితా సంకలనాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కొట్టి వేస్తూ, జస్టిస్ జీవన్ రెడ్డి ఇచ్చిన తీర్పులో 'ఏ ఆలోచననూ నిషేధించలేం. అలా నిషేధిస్తే మానవ సమాజం ముందుకు పోదు' అని వ్యాఖ్యానించారు. పుస్తకాలను నిషేధించడమే తప్పని భావిస్తున్నప్పుడు, అసలు నిషేధించని పుస్తకాలను వీళ్ళెలా అడ్డుకుంటారు? విజయవాడలో గూండాలకు వ్యతిరేకంగా చంద్రరాజేశ్వరరావు కర్రపుచ్చుకుని నిలబడ బెట్టే వాళ్ళు తోకముడిచారు. అవసరమైతే మతోన్మాదులకు వ్యతిరేకంగా తిరుపతిలో కూడా వీధిపోరాటాలకు దిగాల్సి ఉంటుంది" అని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ "ఆ గొడవ జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్నాను. పెరియార్ హిందూ వ్యతిరేకి అని చాలా నీచంగా మాట్లాడారు. కనుక మనం పెరియార్ పుస్తకాలను పట్టుకుని పూలే విగ్రహం నుంచి గాంధీ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించాలి. ఈ మతోన్మాదులు తిరుపతి కేంద్రంగా ఉన్మాదాన్ని ప్రచారం చేస్తున్నారు. గౌరీ లంకేష్‌ను, కల్బుర్గిని చంపిన వారిని ఊరేగించే పరిస్థితి వచ్చింది.

ప్రముఖ రచయిత, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ, "అన్ని భావాలు అర్థం చేసుకుంటే కానీ సత్యాన్ని అన్వేషించలేం. ఇది రాజ్యానికి, వ్యక్తికి మధ్య జరిగే పోరాటం. ఇది చాలా పెద్ద సమస్య. ఇది ఒక రకమైన ఫ్యాసిజం. సంఘర్షణ నుంచే అగ్ని పుడుతుంది అని ఛంఘిజ్ కాన్ అంటాడు. పెరుమాళ్ మురుగన్ పైన చేసిన దాడి అతన్ని అంతర్జాతీయ స్థాయి రచయితను చేసింది. సృజన కారుడికి ఇది చాలా పెద్ద సమస్య. సత్యం చెప్పడానికి భయపడుతున్న కాలం ఇది. అలాంటి పరిస్థితి రాకుండా కలిసి కట్టుగా సహకరించాలి. గళమెత్తి నిరసన తెలపాలి."

రాజ్యాంగ వేదిక అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ "ఇలాంటి బుట్ట బెదిరింపులకు మనం భయపడకూడదు. మనం కూడా రోడ్డు పైకి రావాల్సిందే. కులాల మధ్య, మతాల మధ్య, ప్రజల మధ్య సయోధ్య కుదర్చాలి. మాంసం తినకూడదంటూ పిరమిడ్ వారు 5వేల మందితో తిరుపతిలో ప్రదర్శన నిర్వహిస్తారట. మనం ఏం తినాలో, ఏం తినకూడదో వీళ్లు నిర్ణయిస్తారా?" అంటూ ప్రశ్నించారు.

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ, "బీజేపీ, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ వారు తిరుపతిపైన దృష్టి కేంద్రీకరించారు. దీంతో తిరుపతి డేంజర్ జోన్ లోకి వచ్చేసింది. ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పైన భజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేశారు. తిరుపతిలో గరుడ వారధికి టీటీడీ నిధులు ఇవ్వకూడదని బీజేపీ నాయకుడు భాను ప్రకాష్ కోర్టులో పిటీషన్ వేస్తారు. మదరసాలలో చిన్న పిల్లలకు చదువు చెప్పడం ఆపేయాలని ప్రయత్నించారు. వీళ్ళని తన్నే రోజులు వచ్చాయి. ఎవరు ఏం తినాలో వీళ్ళు చెపుతారా? ఎదురు దాడి చేయకపోతే నష్టం జరిగిపోతుంది. ఈ రోజు పుస్తకాల దగ్గరకు వచ్చారు. రేపు ఇళ్ళ దగ్గరకు వస్తారు. భారతీయులకు సంకెళ్ళు వేసి స్వదేశానికి పంపితే బీజేపీ నాయకులు నోరు విప్పలేదు" అంటూ విమర్శించారు.

సాహితీవేత్త సాకం నాగరాజు మాట్లాడుతూ, "హిందు మత లక్ష్యం మత సామరస్యం అని వివేకానందుడు అన్నాడు. నిన్న జరిగిన సంఘటనతో ఒక హిందువుగా నేను తలదించుకుంటున్నాను. అన్యమతస్తులంటున్నారు. ఫోన్లు, టీవీలు, సెల్ ఫోన్లు, కనిపెట్టింది ఎవరు? అన్యమతస్థులు కాదా? వాటిని ఎలా వాడుతున్నారు? మతోన్మాదులు ఈ దేశానికి పెద్ద శత్రువులు" అంటూ హెచ్చరిక చేశారు.



సీపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనశాలలో విశాలాంధ్ర దగ్గరకువచ్చి మతోన్మాదులు అల్లరి చేయడం పై జిల్లా ఎస్ పీకి ఫిర్యాదు చేయాలని, 11వ తేదీ మంగళవారం సాయంత్రం అంబేద్కర్ భవన్ నుంచి గాంధీ రోడ్డు వరకు పెరియార్ పుస్తకాలతో ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా కార్యదర్శ ఏఎన్. పరమేశ్వరరావు మాట్లాడుతూ, "దేశాన్ని 500 ఏళ్ళ వెనక్కి తీసుకెళ్ళాలని ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసమే పుస్తకాలను నిషేధించాలని చూస్తోంది." అన్నారు. రచయితల సంఘం రాష్ట్ర నాయకులు శరత్ చంద్ర, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కరవది సుబ్బారావు, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ టి.జనార్ధన్, బిసి సంఘర్షణ సమితి నాయకులు బుసకాని లక్ష్మయ్య, కేశవులు, ఐద్వా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

104 ఉద్యోగుల జీతాలు పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఏపిలో 104 డీఈవోలు, డ్రైవర్లు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నారని అయితే 104లో పనిచేస్తున్న ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం ఆర్ఎఫ్‌పిలో డిఇఒలకు జీతభత్యాల పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం పట్ల ఉద్యోగులు ఆందోళనకు గురౌతున్నట్లు 104 ఉద్యోగుల విషయం పట్టించుకోవడం లేదని 104 యూనియన్ నాయకులు విక్టర్, మణికంఠ, భాస్కర్, శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. డిఇఒలు, డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయడంతో పాటు ఆర్‌పిఎఫ్‌లో పొందుపర్చాలని, సిటిసి విధానాన్ని రద్దు చేసి ఈపిఎఫ్‌లో యాజమాన్యం వాటా చెల్లించాలని కోరారు. 104 ఉద్యోగులకు వెటేజీ మార్కులు ఇవ్వాలని ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో లాగా ఫుడ్ అలెవనెన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు విక్టర్

పారదర్శకంగా మద్యం షాపులు కేటాయింపు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రభుత్వ నిబంధనల మేరకు పాదర్శకంగా గీతకార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తున్నట్లు జిల్లా ప్రోహిబిషనల్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గీత కార్మికులకు ప్రభుత్వ నిబంధన మేరకు 10 మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని, ఇందులో గీత కార్మిక ఉపకులాలు గౌడ ఉపకులం ఒకటి, ఈడిగ ఉపకులాలకు ఏడు, గౌండ్ల ఒకటి, గౌండ ఉపకులాని ఒకటి మద్యం దుకాణాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలు గీత కార్మిక కుటుంబాలకు మద్యం షాపుల కేటాయింపుపై తెలియజేశారు.

శ్రీనివాస్, ప్రోహిహిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి

ప్రజాశక్తి: గీతకార్మికులకు ఎన్ని మద్యం షాపులు కేటాయించారు?

ఎక్సైజ్ అధికారి: ప్రభుత్వ రేషియో మేరకు జిల్లాలో 10 మద్యం దుకాణాలు కేటాయించడం జరిగింది. అర్హులైన గీత కార్మికులు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేసుకున్నారు. లాటరీ పద్ధతి ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు రూరల్, గుడిపల్లి ఈడిగ ఉపకులాలకు, పాలసముద్రం గౌడ, ఉపకులానికి, వికోట ఈడిగ ఉపకులానికి, పెద్దపంజాణి గౌండ్ల ఉపకులానికి, వెదురుకుప్పం మద్యం షాపు గౌడ్ ఉపకులానికి కేటాయించడం జరిగింది.

ప్రజాశక్తి: మద్యం షాపుల కేటాయింపు ఎలా?

ఎక్సైజ్ అధికారి: మద్యం దుకాణాల కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో లాటరీ పద్ధతి ద్వారా కేటాయించడం జరుగుతుంది. షుగర్‌ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం.

ప్రజాశక్తి: మద్యం దుకాణం కోసం దరఖాస్తు రుసుం ఎంత చెల్లించాలి?

ఎక్సైజ్ అధికారి: ప్రభుత్వ నిబంధనల మేరకు గీత కార్మికులు కులధృవీకరణ పత్రం జత చేస్తూ దరఖాస్తు రుసుం రెండు లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఇలా చెల్లించిన రుసుం తిరిగి చెల్లించబడదు. ఫామ్ ఏ-3 పూర్తి చేసి ఇవ్వాలి.

ప్రజాశక్తి: బినామీలు దరఖాస్తు చేశారని ఆరోపనులున్నాయి?

ఎక్సైజ్ అధికారి: బినామీలు దరఖాస్తులుంటే ఆధారలతో పాటు ఫిర్యాదు చేస్తే అలాంటి దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుంది. తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందుపరిస్తే చర్యలు తప్పవు.

ప్రజాశక్తి: దరఖాస్తు పత్రంలో పాటు ఎలాంటి ఐడీలు ఇవ్వాలి?

ఎక్సైజ్ అధికారి: మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఫోటోలు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు సమర్పించాలి. ముఖ్యంగా కులధృవీకరణ పత్రం తప్పనిసరి.

ఏఆర్ బలగం వార్షిక మొబిలైజేషన్ ముగింపు

పోలీసు శాఖకు వెన్నుముక్క జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ఏఆర్ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి సంవత్సరం చిత్తూరు జిల్లా ఏఆర్ బలగానికి వార్షిక మొబిలైజేషన్‌ను నిర్వహించడం ఆనవాయితీ. జనవరి 28 నుండీ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశానుసారం జిల్లా సాయుధ దళం పెరేడ్ గ్రౌండ్, చిత్తూరులో 15 రోజుల వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం మొదలైంది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై ఏఆర్ సిబ్బంది అధికారులచే గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ 15 రోజుల కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది, అధికారులకు పెరేడ్ నిర్వహణ, సెక్యూరిటి, రక్షణ, ఆయుధాలను ఉపయోగించడంలో మెళకువలు, ఫైరింగ్ ప్రాక్టీసు, బందోబస్తు నిర్వహించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థుతులలో విఐపి కంట్రోల్ వంటి అన్ని రకాల నైపుణ్యాలను పునఃసమీక్షించించడంలో నిష్ణాతులుగా చేయడం జరిగిందన్నారు. ఏఆర్ బలగాలు జిల్లా బలగానికి వెన్నెముఖ లాంటిదని, వీరి ఉద్యోగం వైవిధ్యభరితమే కాకుండా కష్టతరమని అన్నారు. ఈ కార్యక్రమం రూపొందించిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీలు చిన్నికష్ణ, మహబూబ్ బాష, అడ్మిన్ చంద్రశేఖర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాగంగా అపోలో హాస్పిటల్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ వారి సహకారంతో సిబ్బంది, అధికారులకు ఫస్ట్ ఎయిడ్, లైఫ్ సేవింగ్ ప్రొసీజర్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బంది, అధికారులకు సర్టిఫికేట్‌లతో సత్కరించారు.

నేడే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో నిర్వహించి ఆల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల కడుపులోని కొంకి పురుగులు, నులి పురుగులు బద్దె పురుగులు, గుండ్రని పురుగులు నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్య వృద్ధి పెంపొందించి తద్వారా ఉన్నత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. పిల్లల, కిశోర బాలుల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం రక్త హీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని దీని నుండి పిల్లలని కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంను విద్యాశాఖ, వైద్యశాఖ, ఐసిడిఎస్, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ హాస్టల్ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయం పనిచేసి వంద శాతం పూర్తి చేయాలి కలెక్టర్ ఆదేశించారు.



శిథిలావస్థలో ఏడీ ఆసుపత్రి

- ఏళ్ళతరబడి వర్షాలకు ఉరుస్తున్న భవనాలు
- ఏడీతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్న వైనం

గంగాధర నెల్లూరు నెల్లూరు పశువైద్య ఏడి ఆసుపత్రి భవనం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు పశువైద్యశాఖ ఏడీ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది.. ఈ ఆసుపత్రి భవనాలు ఏళ్ళతరబడిగా పట్టించుకోకుండా వదిలివేయడంతో వర్షాలకు ఉరుస్తూ, గోడలు సైతం పగుళ్ళు బారిన పడ్డాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గ కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ఏడీ ఆసుపత్రిగా కొన్నేళ్ల కిందట అప్ గ్రేడ్ అయిందే గాని అందుకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు కాలేదు. ఈ ఏడీ ఆసుపత్రి కింద గంగాధరనెల్లూరు, పాలసముద్రం మండలాల్లోని పశువైద్య కేంద్రాలుపై పర్యవేక్షణ ఉంటుంది. రెండు మండలాలలో దాదాపు ఒక ఏడి, ఐదు మంది డాక్టర్లు, 21 మంది వెటర్నరీ సహాయకులు, పది మంది గోపాల మిత్రులు పనిచేస్తున్న ఆసుపత్రి భవనంలో కనీస అవసరాలు లేకుండా ఆ శాఖ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ నెలలో రెండు లేదా మూడుసార్లు మీటింగులు పెట్టుకోవడానికి కూడా భవనం లేకపోవడం పట్ల అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో దాదాపు 30 వేల పశువులు, 25 వేల గొర్రెలు ఉన్నాయి. ఆసుపత్రి ఆవరణంలో గదుల్లోకి పలుసార్లు పాములు వచ్చేయడంతో భయభ్రాంతులకు గురైన అధికారులు, సిబ్బంది పరుగులు తీశారు. సంబంధిత జిల్లా అధికారులు ఇప్పటికైనా ఏడీ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించడానికి దృష్టి సారించాలని ఇక్కడ విధులు నిర్వహించే వారు వాపోతున్నారు.



పెచ్చులూడిపోయిన ఆసుపత్రి భవనం పైకప్పు

'గురువు'కి ప్రత్యామ్నాయం లేదు

ప్రజాశక్తి- గంగవరం: గురువు స్థానానికి ప్రత్యామ్నాయం ఏదీ లేదని పూర్వఆచార్యులు శంకరయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కళామందిరంలో జరిగిన గురువందనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పందన ఫౌండేషన్ అధ్యక్షురాలు వి. త్యామలమ్మ మాట్లాడుతూ గురువులు ఆదర్శంగా ఉండాలన్నారు. తెలుగు సాహిత్య సాహృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు మాట్లాడుతూ టీచర్లు సామాజిక స్పృహ కలిగి ఉండాలని అప్పుడే విద్యార్థులు కూడా ఉపాధ్యాయులను అనుసరిస్తారన్నారు. అనంతరం 40 సంవత్సరాలకు ముందు గురువులుగా పనిచేసిన వారిని తులసినాథం నాయుడు దంపతులు ఘనంగా సన్మానించారు. పుష్ప, రామచంద్ర, హరిప్రసాద్, రాజేంద్ర, మునికృష్ణ, జ్యోతి, మల్లేశ్వరి, లోకనాథం శ్రీహరి, గాలిబాబు, బాలాజీ, హరిబాబు, దీనమ్మ, శివయ్య, సుధాకర్, మణి, నరసింహారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

తాగునీటి క్లోరినేషన్ యూనిట్ల ఏర్పాటు

పైప్ లైన్ వద్ద మెకానిక్‌తో పాటు సర్పంచ్ రెడ్డప్ప

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పరిధిలోని తాగునీటి సరఫరా పైప్‌లైన్ల వద్ద క్లోరినేషన్ యూనిట్లను ఏర్పాటు చేసి క్లోరిన్ టాబ్లెట్లను అందులో వేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ రెడ్డప్ప తెలిపారు. ఆదివారం మెకానిక్ కృష్ణయ్యతో పాటు ఆయన కూడా క్లోరినేషన్ యూనిట్ల ఏర్పాట్లలో పాలుపంచుకొని ఓవర్ హెడ్ ట్యాంకులకు వెళ్లే పైప్లైన్ల వద్ద నూతన యూనిట్లను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి మేనక మాట్లాడుతూ స్వచ్ఛమైన త్రాగునీరు పరిసరాల పరిశుభ్రం వీధిదీపాల ఏర్పాటు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్ర అధ్యక్షులుగా గోపినాథరెడ్డి ఏకగ్రీవం

గోపినాథరెడ్డిని అభినందిస్తున్న న్యాయశాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గుంటూరులో ఆదివారం న్యాయశాఖ ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్‌గా మన గోపినాథ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా నుండీ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవమైన గోపినాథ్‌రెడ్డికి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణకు సహకరించండి

ప్రజాశక్తి- పూతలపట్టు: ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు దళితులందరూ సహకరించాలని ఆ సంఘం నాయకులు జీవరత్నం పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ భవనంలో మండల దళిత నాయకుల సమావేశం జరిగింది. దళితుల ఆశాజ్యోతి అంబేద్కర్ జయంతిని పండుగ వాతావరణంలో కనివిని ఎరుగని రీతిలో జరుపుకోవాలని నిర్ణయించారు. నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ సహకారంతో అంబేద్కర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. షణ్ముగం, ఎమ్మెస్ మనీ, బాలాజీ పాల్గొన్నారు.

ఈసిఈలో ఝూన్సీలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగపు పరిశోధక విద్యార్థిని కే ఝూన్సీలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎస్వీయూ పరీక్షల అధికారి దామ్లా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసిఈ ఆచార్య జి శ్రీనివాసులు పర్యవేక్షణలో 'ఏ కంపాక్ట్ డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎ హైబ్రిడ్ ఎఈఎస్ 256 కికాక్ టెక్నిక్ ఇన్ ఎస్‌హెచ్‌ఏ 3-512 ఫర్ ఇన్హెన్సింగ్ డేటా సెక్యూరిటీ యూజింగ్ ఎఫ్ ఫిజిఏ 'అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఝూన్సీ లక్ష్మి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లలో అనేక పరిశోధనా వ్యాసాలు ప్రచురించి నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఝూన్సీ లక్ష్మీకి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

గణిత ఉత్తీర్ణత శాతం పెంచేలా శిక్షణ

పజాశక్తి- చిత్తూరు అర్బన్: జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం, అప్పుస్మా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో చిత్తూరు జిల్లా ప్రైవేట్ పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణిత అవధాని ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ పరీక్షలకు హాజరుగు విద్యార్థులకు సూక్ష్మ ప్రణాళికల ద్వారా అత్యధిక మార్కులు సాధించే విధానాలను తెలియజేశారు. సి, డి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గిరిధర మూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో గణితంపై భయాన్ని పోగొట్టాలని కోరారు. రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు డి.సిద్ధరంగ పిళ్ళే విద్యార్థులలో వేగం సజనాత్మకత పెంపొందించుటకు టవర్ ఆఫ్ హన్నాయ్ గురించి వివరించి దీనిని ద్విసంఖ్యామానంలోకి ఎలా మార్చవచ్చో వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ మ్యాథ్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు చంద్రమ నాయుడు మాట్లాడుతూ గణితంలో ఉత్తీర్ణతా శాతం పెంచితే పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని అందుకు ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం కషి చేస్తున్నదని తెలిపారు. విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం. తేజో మూర్తి మాట్లాడుతూ టీచర్ ప్రతిరోజు కొత్త విషయాలతో పాఠాలతో పాటు నైతిక విలువలు బోధించాలని తెలిపారు. అప్పుస్మా రాష్ట్ర కోశాధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల దిశానిర్దేశం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం జిల్లాలోని అన్ని పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరమని అభినందించారు. జన విజ్ఞాన వేదిక నగర శాఖ అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థుల నైతిక విలువలు పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదే అని ఉత్తమ సమాజ నిర్మాణం కోసం పాటుపడే ఉపాధ్యాయులకు సమాజం అండగా నిలవాలని కోరారు. జిల్లా మహిళా అధ్యక్షులు పాపుదేశి జయంతి, సభ్యులు జవహర్లాల్ రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో వారం రోజులుగా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం చేస్తున్నామని తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాలలో అన్ని రక్షిత మంచినీటి బోరు మోటర్లు విద్యుత్ కనెక్షన్లు తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్ద కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఆర్ఎస్.కె సెంటర్‌లో రైతులకి రైతు డిజిటల్ గుర్తింపులు కార్డు ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయ అధికారి గీత కుమారి తెలిపారు. రైతు సోదరులకు ఇది ఒక సువర్ణ అవకాశం ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి గీత కుమారి మాట్లాడుతూ రైతులు మీమీ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా నమోదు చేసుకుని డిజిటల్ గుర్తింపు కార్డు పొందవచ్చు అని తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు రైతులకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నేడు కంటి వైద్య శిబిరం నిరసిస్తున్నట్టు చెన్నై శంకర్ నేత్రాలయ కంటి వైద్య పరీక్ష సిబ్బంది మురళి ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ప్రతినెలా రెండో సోమవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని, కంటి సమస్య ఉన్నవారు కంటి పరీక్షలు చేసుకొని తగిన చికిత్సలు చేసుకోవాలని కోరారు.

లక్ష్యం దిశగా చదవండి..

సిర్డ్స్ సంస్థ స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: విద్యార్థులు లక్ష్యం దిశగా చదవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నా రు. పేద విద్యార్థులకు సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'బ్యాక్ టూ స్కూలు' కార్యక్రమంలో భాగంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 150 మంది విద్యార్థు లకు 25 లక్షల రూపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకుని అందుకు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి సౌకర్యాలు లేవని ఉంటే ఎంతో మంది చదువు కునే వాళ్లమని తెలిపారు. డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో తమకు ఇలా చెప్పే వాళ్లు ఎవరూ లేరని, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో వుంటూ పది మందికి సహాయం చేస్తున్నామన్నారు. నేడు సిర్డ్స్ సంస్థ ద్వారా 25 లక్షలు రూపాయలు 150 మంది పిల్లలకు అందించడం అభినందనీయమన్నారు.

గజదాడులకు శాశ్వత పరిష్కారం చూపాలి

రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి- పలమనేరు: జిల్లాలో ఏనుగుల దాడుల నుండి పంటలతోపాటు రైతులకు పూర్తి రక్షణ కల్పించి గజ దాడులను అరికట్టేందుకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమాపతి నాయుడు ఆదివారం వినతిపత్రం అందించారు. పలమనేరు రూరల్ మండలంలోని మొసలిమడుగు గ్రామ సమీపంలో గల అటవీ క్షేత్రంలో కుంకీ ఏనుగుల కోసం చేపడుతున్న విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని అడవి ప్రాంతాలైన కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, పులిచెర్ల, సోమల, ఐరాల తదితర ప్రాంతాల్లో సుమారు 120 ఏనుగులు ఉన్నాయని ఇవన్నీ సమీప పంట పొలాలపై రాత్రి పగలు తేడా లేకుండా దాడులు చేస్తూ రైతుల పంటకు నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. అటవీ సమీప ప్రాంతాల్లో పంట పొలాలపై ఏనుగులు రాకుండా కొన్నిచోట్ల కందకాలతో పాటు సోలార్ పెంచింగ్ ఏర్పాటు చేయాలని, ఏనుగుల బారినుండి రైతులకు పంటలకు పూర్తి రక్షణ కల్పించి ఆదుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద ఆదివారం కుప్పం ఆర్ ఆర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాలనుండి విచ్చేసిన 105 మంది రోగులకు కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైద్య బృందం ఈసీజీ, బీపీ, షుగర్ వంటి సాధారణ పరీక్షలు నిర్వహించి, వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ వారు రోగులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. సీతాపతి, డాక్టర్ సురేష్ ,మణిరత్నం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంకు విశేష స్పందన లభించిందని శంకర్ నేత్రాలయ డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో 50 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని, 22 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరందరికీ ఉచితంగా భోజనం, వసతి కల్పించి ఆపరేషన్ చేసి మందులు అందించడం జరుగుతుందన్నారు. డాక్టర్ రమణ, డాక్టర్ గంగాధర్ చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

బైరెడ్డిపల్లిలో..

బాధిత మహిళకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : కిరణ్ రాయల్ చేతిలో మోసపోయిన మహిళ ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిపాలైన బాధిత మహిళకు వెంటనే న్యాయం చేయాలని, ఆ పార్టీ నుండి ఆయనను తొలగించాలని కోరుతూ కిరణ్ రాయల్ ఇంటిని మహిళలు ఆదివారం పెద్ద ఎత్తున ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై మీడియా ఎదుట కిరణ్ రాయల్ బాధిత మహిళను దూషించడంతో కోపోద్రిక్తులైన మహిళలు ఆదివారం ఆయన ఇంటిని ముట్టడించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళను మోసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. బాధిత మహిళ లక్ష్మిని మహిళా సంఘాలు కలిసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'మహిళలకు రక్షణ కల్పిస్తానన్న పవన్ కళ్యాణ్ ఇదేనా? మీరు కల్పించే రక్షణ?' అంటూ ఆయనను ప్రశ్నించారు. కిరణ్ రాయల్‌ను జనసేన నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. గొడవ చేస్తే అరెస్టు చేస్తామంటూ బెదిరించారు. బాధితు రాలికి న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని మహిళలు భీష్మించుకు కూర్చున్నారు. పోలీసు లు వారికి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపేశారు.

అలిపిరి రోడ్డు అస్తవ్యస్తం

- రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు
- ప్రమాదాలకు నిలయం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీవారి భక్తులు తిరుమలకు చేరుకునేందుకు, ట్రాఫిక్ జామ్ సమస్య నుంచి బయటపడేందుకు ఏర్పాటు చేసిన అలిపిరి-చెర్లోపల్లి బైపాస్-రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి రహదా రి కి అడ్డంకిగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాల తో నిండి పోయింది. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంత జరుగుతున్నా టిటిడి అధికారులు అటుపక్క చూస్తే ఒట్టు.. నిత్యం అదే దారిలో పయనిస్తున్నా స్పందించక పోవడం గమనార్హం.

తిరుమలకు వెళ్లేందుకు శ్రీవారి భక్తులకు అలిపిరి బైపాస్-రోడ్డు ఎంతో కీలకం. బెంగుళూరు, వేలూరు, చిత్తూరు, అనంతపురం, కడప, రాయచోటి , మదనపల్లి మీదగా వచ్చే వాహనాలన్నీ చెర్లోపల్లి సర్కిల్ నుంచి ఎస్‌వి జూపార్కు మీదగా అలిపిరి బైపాస్‌లో ప్రయా ణించి, తక్కువ సమయానికి అలిపిరికి చేరుకుంటాయి. తిరుపతి నగరానికి ప్రవేశించే ప్రధాన రహదారి కంటే ఈ రోడ్డుపై వెళితే పది కిలోమీటర్లు మేర తగ్గుతుంది. అందుకు వాహనదారులు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగించుకుంటారు. కానీ గత కొన్ని నెలలుగా ఈ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరిగి పోవడంతో రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయి. జీబ్రా లైన్లు, సూచిక బోర్డులు సైతం పిచ్చి మొక్కల మధ్య ఇరుక్కుపోయాయి. ముళ్లపొదలు, రాగి మొక్కలు అధికంగా వుండడంతో రోడ్డుకు పక్కగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు అవి గుచ్చుకుని గాయాల పాలవు తున్నారు. చాలా మందికి సూచిక బోర్డులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు, అటు టిటిడి ఇంజనీరింగ్, అటవీశాఖ, ఆర్అండ్‌బి అధికారులు ఒకరిపై ఒకరు దాట వేసుకుంటూ తాము కాదంటే తాము కాదని తప్పించు కుంటున్నారు. ఇదే అదునుగా భావిస్తూ నగరంలో పలు హోటళ్లు, చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాల న్నిటినీ అలిపిరి బైపాస్ రోడ్డులో అన్‌లోడ్ చేస్తున్నారు. ప్రమాదాలకు తోడు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే దుర్గంధం తప్పడం లేదు. పైగా అదే దారిలో టాటావారి సూపర్‌స్పెషాలిటీ కేన్సర్ ఆస్పత్రి, అరవింద్ ఐ ఆస్పత్రి, ఎస్‌వి జూపార్కు, సైన్స్ సెంటర్, ఏపి టూరిజం కళాశాల, వేదిక్, వెటర్నరీ, ఎస్‌వియు యూనివర్సిటీల ఉద్యోగులు, విద్యార్థులు, భారతీయ విద్యాభవన్ చిన్నారులు, టిటిడి ఎస్‌విబిసి చానల్ కార్యాలయం వంటి ప్రముఖమైన సంస్థలు, కార్యాలయాలు, ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, కార్పొరేషన్ అధికారులు, టిటిడి, అటవీశాఖ, ఆర్అండ్‌బి అధికారులు నిత్యం ఇదే దారిలో ప్రయాణిస్తుంటారు. ప్రతి రోజూ అక్కడ జరిగే ప్రమాదా లను గమనిస్తున్నా కనీసం స్పందించకపోవడం దారుణం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించి, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులను, వాహనదారులను, పాద చారుల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరు తున్నారు.

రోడ్డుకు ఇరు వైపులా ప్రమాదకర స్థితిలో వ్యాపించిన పిచ్చి మొక్కలు

క్రైం న్యూస్

37 లీటర్ల నాటుసారా స్వాధీనం

- 800 లీటర్ల సారా ఊట ధ్వంసం - ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- యాదమరి: తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన తెల్లరాళ్లపల్లి గ్రామపంచాయతీ రంగనాయక చెరువు అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేశారు. ఆదివారం అసిస్టెంట్ కమీషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆదేశాలమేరకు ఎన్ఫోర్స్మెంట్ సిఐ పవన్ సిబ్బందితో యాదమర్రి మండలం తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన తాండవన్, శంకర్, బాలకృష్ణ నుండి 37 లీటర్లు నాటుసారాను, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటుసారా తయారీకి రంగనాయక చెరువు వద్ద అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 800 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులలో సిఐ పవన్ కుమార్, ఎస్సై సుబ్రహ్మణ్యం, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, రాజేష్, ఢిల్లీ బాబు, హేమాద్రి, దీప పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం చెరువులో గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యమైనట్టు సిఐ శ్రీనివాసులు తెలిపారు. గత మూడు రోజుల క్రితం మండలంలోని మొగిలి సమీపంలో గల గౌన్ చెరువులో యువకుడు స్థానానికి వెళ్లి గల్లంతయ్యాడు. అప్పటినుండి స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది, పరిశ్రమలో పనిచేస్తున్న తోటి కార్మికులు చెరువును గాలించగా ఆదివారం సెల్వ కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. సెల్వ కుమార్ తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బావిలో జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- యాదమరి: బావిలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదమరి మండలం ఓటివారిపల్లి గ్రామపంచాయతీ కొత్తూరు ఆది ఆంధ్రవాడలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.కొత్తూరు ఆది ఆంధ్రవాడకు చెందిన సురేష్ (40) గ్రామ సమీపంలోని బావిలో జారి పడినట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బావిలోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సురేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం- వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- చౌడేపల్లి: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెద్ద ఎల్లకుంట్ల పంచాయతీ ఊటూరు బస్టాప్ వద్ద అదే గ్రామానికి చెందిన చంద్రబాబు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అతని అదుపులోకి తీసుకొని అతని నుంచి 12 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. గతంలోనూ చంద్రబాబుపై నాటు సారా కేసు ఉన్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సదుం: చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయిన ఓ గుర్తు తెలీని వ్యక్తి శవాన్ని గుర్తించినట్లు సదుం ఎస్సై షేక్ షా వలి తెలిపారు. మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామ పంచాయతీ, అంకాలమ్మ గుడి దగ్గర్లోని ఫారెస్ట్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసఉస ఉంటుందని, మృతదేహం బాగా కుళ్ళి పోయివుందని, వారం క్రితమే వ్యక్తి మరణించి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మరణించిన వ్యక్తికి సంబంధించి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని చిత్తూరు- పుత్తూరు రోడ్డు వేల్కూరు సమీపంలో లారీ ఆటోలు శనివారం రాత్రి ఢీకొన్న ఘటనలో 13 మందికి గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అగరమంగళం దళితవాడకు చెందిన పెరియస్వామి (45)కి తీవ్రగాయాలు కావడంతో వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇతను జైన్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు.

ఎస్వీయూ విద్యార్థిపై దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎస్‌వియూలో ఓ విద్యార్థిపై పూర్వ విద్యార్థి దాడికి పాల్పడ్డాడు.. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్‌వియూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు..శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థిపై పూర్వ విద్యార్థి, రౌడీషీటర్ మణికంఠ దాడికి పాల్పడ్డాడు. గతంలో ఎస్‌వి యూనివర్సిటీలో గతంలో మణికంఠ విద్యను అభ్యసించాడని, తరచూ ఎస్‌వియు క్యాంపస్ లోని హెచ్ బ్లాక్ లోకి వెళ్లి విద్యార్థులతో గొడవపడేవాడని తెలిపారు. ఇటీవల తనకు గౌరవం ఇవ్వలేదని ఎస్వీయూలోని హెచ్ బ్లాక్ విద్యార్థి వెంకటేశ్వర్లుతో గొడవపడ్డాడు. ఈ ఆక్రోశంతో హెచ్ బ్లాకు వద్దకు వెళ్లిన, పూర్వపు విద్యార్థి మణికంఠ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడికి చేశాడు. ఈ దాడిలో వెంకటేశ్వర్లు కాలుకు గాయా లయ్యాయి. స్పందించిన వెంకటేశ్వర్లు వెంటనే ఎస్వీయూ క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఫిర్యాదు మేరకు మణికంఠపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.